క్లుప్తంగా

గ్రామదేవతలకు విశేష పూజలు



మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మకు ప్రత్యేక పూజలను గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సలిపిండి, పానకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

బియ్యపు గింజపై శివలింగం



మనుబోలు: మండలంలోని యాచవరానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము బియ్యపు గింజపై సూక్ష్మ శివలింగాన్ని తీర్చిదిద్దారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దీన్ని రూపొందించానని ఆయన చెప్పారు.

'దళారులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు'

మనుబోలు: ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో దళారుల రాజ్యం నడుస్తోందని బీజేపీ నేత బోలా శ్రీనివాసులు ధ్వజమెత్తారు. ఈ మేరకు కాగితాలపూరులో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

వేళాంగణి చర్చిలో ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: వేళాంగణి మాతను నమ్మితే జన్మ ధన్యమవుతుందని కోడూరు వేళాంగణి చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ పేర్కొన్నారు. కోడూరులోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను ఆదివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ



పొదలకూరు: పట్టణంలోని శివాలయంలో అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదాన్ని స్థానిక నాగార్జున స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. అయ్యప్ప సేవా సమాజ గౌరవాధ్యక్షుడు పరంధామిరెడ్డి, సెక్రటరీ చొప్పా వెంకటేశ్వర్లు, స్కూల్ యాజమాన్యం సుబ్బారావు, చంద్రశేఖర్, సునితారెడ్డి, పాపయ్య, కృష్ణ, జీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. అపహరణ



చోరీ జరిగిన దుకాణం

బుచ్చిరెడ్డిపాళెం : కూరగాయల దుకాణంలో సరుకులను కొనుగోలు చేస్తున్నట్లు నటించి రూ.20 వేల నగదును స్వాహా చేసిన ఉదంతం బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న కూరగాయల దుకాణానికి సరుకుల కోసం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వ్యాపారి సరుకులు ఇస్తున్న క్రమంలో గల్లా పెట్టెలోని రూ.20 వేల నగదును చోరీ చేశారు. కొద్దిసేపటికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

పల్లెలకు జ్వరమొచ్చింది

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- అవగాహన కల్పించని కూటమి ప్రభుత్వం
- ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు



వెంకటాచలం సీహెచ్‌సీలో జ్వరపీడితులు

వెంకటాచలం: పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడం.. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించకపోవడంతో రోగం తగ్గక రోజుల తరబడి మంచాలకే పరిమితమవుతున్నారు.

ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు

మండలంలోని 25 పంచాయతీల్లో 60 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ఈ నెల పది తర్వాత వర్షాలు కురవడంతో గ్రామాల్లో ప్రజలు నిత్యం జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామంలో ఇంటికొకరు లేదా ఇద్దరు జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మండలంలోని గొలగమూడి, కంటేపల్లి, తిక్కవరప్పాడు, తిరుమలమ్మపాళెం, చవటపాళెం, కసుమూరు, ఇడిమేపల్లి, కురిచెర్లపాడు, తదితర గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉంది. వెంకటాచలంలోని సీహెచ్‌సీ, కసుమూరు, ఇస్కపాళెం పీహెచ్‌సీల్లో జ్వరపీడితులు చికిత్స చేయించుకుంటున్నారు.

అవగాహన కల్పించేవారేరీ..?

విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించే నాథుడే కరువవుతున్నారు. అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించిన దాఖలాల్లేవు. వెంకటాచలంలోని సీహెచ్‌సీ, ఇస్కపాళెం పీహెచ్‌సీల్లో వైద్యసేవలను సక్రమంగా అందించడంలేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇస్కపాళెం పీహెచ్‌సీలో ఇంజెక్షన్ సైతం వేయకుండానే మందులిచ్చి పంపుతున్నారని పలు గ్రామాల మహిళలు వాపోతున్నారు.

నాడెంతో సజావుగా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో తరచూ తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేవారు. వ్యాధి లక్షణాలపై ప్రతి ఇంటికీ వెళ్లి వివరించేవారు. అయితే నేడు ఆ పరిస్థితే కనిపించడం లేదు.

పిండేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు

వెంకటాచలం, సర్వేపల్లి, కసుమూరు, గొలగమూడి, నిడిగుంటపాళెంలో ప్రైవేట్ హాస్పిటళ్లున్నాయి. జ్వరాలబారిన పడిన వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. అయితే అక్కడ ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యాన్ని సక్రమంగా అందిస్తే తమకీ బాధలు ఉండవని పేర్కొంటున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందించేలా చూడాలని కోరుతున్నారు.



వైద్యుల కోసం పడిగాపులు



ఓపీ వద్ద రోగులు

నేత్రపర్వంగా సంగమేశ్వరుడి కల్యాణం



మనుబోలు: వనభోజన మహోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో కండలేరు ఒడ్డున కొలువైన సంగమేశ్వరాలయ ఆవరణలో కామాక్షితాయి, సంగమేశ్వరుడి కల్యాణాన్ని వేడుకగా ఆదివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని గూడూరులోని బజార్‌వీధి వర్తక సంఘ నిర్వాహకులు అందజేశారు.

యూటీఎఫ్ కార్యవర్గ ఎంపిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) మండల మహాసభ సీహెచ్. మాలకొండయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య మండల నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా మోహన్‌రావు, అధ్యక్షుడిగా ఎ.పుట్టయ్య, సహాధ్యక్షుడిగా టి.వెంకటేశ్వర్లు, ఎ.కీర్తన, ప్రధాన కార్యదర్శిగా తిరుపాలు, కోశాధికారిగా ఎస్కే గౌస్‌బాషా, మహిళా కన్వీనర్‌గా ఎస్కే నస్రత్ తస్లిమ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు గౌస్‌బాషా, రవీంద్ర, సుబ్బారావు, ఖాదర్ బాషాను సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎస్.నవ కోటేశ్వరరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శ్రీహరి, జిల్లా కార్యదర్శులు ఎస్కే ఖాజావలీ, కె.నాగిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శైలజ, సంక్షేమ కార్యదర్శి జమీర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముదివర్తిపాళెం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

ఇందుకూరుపేట : తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీలకు మండలంలోని ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సందానందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు టి.ప్రవీణ్‌కుమార్, కె.సుదీప్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు హరయ్యను అభినందించారు.

పోలీసులకు శిక్షణా తరగతులు



కావలి: కావలి కోర్టు ప్రాంగణంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాల్‌లో పోలీసులకు ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. కావలి కోర్టు పరిధిలో విధులు నిర్వర్తించే సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లకు ఏపీపీలు రామకృష్ణ, కే మృదుల సంయుక్తంగా పోలీసు ప్రొసీజర్‌పై శిక్షణ ఇచ్చారు. నిందితులను అరెస్టు చేయడం, కోర్టుకు హాజరుపరచడం, రిమాండ్‌కు తరలించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



పట్టాభికి విన్నవిస్తున్న ఎండీయూ సిబ్బంది

కొడవలూరు : ఇంటికే రేషన్ అందిస్తూ కార్డుదారులకు సౌకర్యవంతంగా ఉన్న ఎండీయూ వాహనాలను కొనసాగించాలని ఆ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని గండవరంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 428 ఎండీయూ వాహనాలున్నాయని, వీటిని నిలిపివేస్తే 856 మంది ఉపాధి కోల్పోతారన్నారు. దీనిపై పట్టాభి మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాహనాలను కొనసాగించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. స్థానిక నాయకులు ఆలం మాలకొండయ్య, పెనాక వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

సందడే.. సందడి



తోటపల్లిగూడూరు: ప్రముఖ పర్యాటక ప్రాంతం కోడూరు బీచ్‌లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పిల్లలు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బీచ్ పరిసరాల్లో పండగ వాతావరణం నెలకొంది. కుటుంబసమేతంగా విచ్చేసిన సందర్శకులు సముద్రస్నానాలు చేసి ఉపశమనం పొందారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన రాకపోకలు సాయంత్రం వరకు కొనసాగాయి.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ఛిద్రం



పాపిరెడ్డిపాళెం సమీపంలో నాగళ్లతోనే రోడ్డుపై పయనిస్తున్న ట్రాక్టర్

తోటపల్లిగూడూరు: రబీలో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ట్రాక్టర్లతో దుక్కులు వేగవంతమయ్యాయి. ఈ క్రమంలో ట్రాక్టర్లు పొలాల్లోకి వెళ్లే సమయంలో పలు రహదారులు ధ్వంసమవుతున్నాయి. దుక్కులు దున్నేందుకు వెళ్తున్న ట్రాక్టర్లు సింగిల్ కేజ్, డబుల్ కేజ్ నాగళ్లతోనే రోడ్లపై పయనిస్తున్నాయి. అలాగే పళ్ల చక్రాలతోనూ రహదారులపై రాకపోకలు సాగిస్తున్నాయి. వాస్తవానికి పొలాల వరకు టైర్లతో వెళ్లి అక్కడ ఈ నాగళ్లను రైతులు అమర్చుకుంటారు. అయితే యజమానులు నిర్లక్ష్యంగా తమ ఇళ్ల వద్దే టైర్లను తీసేసి ట్రాక్టర్లకు నాగళ్లను అమర్చుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పదునైన నాగళ్లతో రహదారులు కోసుకుపోయి ఛిద్రమవుతున్నాయి. దీంతో పలు రహదారులు రూపురేఖలను కోల్పోతున్నాయి. ఇలా వెళ్తున్న ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకునేందుకు యత్నిస్తున్నా, ప్రయోజనం ఉండటంలేదు. పాపిరెడ్డిపాళెం, విలుకానుపల్లి, కాకుపల్లి, చిన్నచెరుకూరు, కోడూరు, ఈదూరు, చింతోపు, నరుకూరు, పేడూరు గ్రామాల మధ్య రహదారులు అధ్వానంగా మారాయి. ట్రాక్టర్లతో రహదారులు ఛిద్రమవుతున్నా, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేడుకగా కార్తీక వనభోజనోత్సవం






బుచ్చిరెడ్డిపాళెం : కనిగిరి రిజర్వాయర్ వద్ద..

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కనిగిరి రిజర్వాయర్ వద్ద కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు తమ కుటుంబాలతో పాల్గొని సందడి చేశారు.

గాంధీ ఆశ్రమంలో..

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్షుడు మన్నెం చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉసిరిచెట్టు కింద మహా శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. తొలుత గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బిరుదవోలు వెంకురెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, నేదురుమల్లి సుబ్బారెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ఆక్రమణల పేరిట భూముల ధ్వంసం

- వైఎస్సార్సీపీ మద్దతుదారులపై కక్ష సాధింపు
- పాలిచెర్లపాడులో టీడీపీ నేతల ఇష్టా రాజ్యం



జేసీబీతో తీసిన కాలువ



పొలాన్ని ధ్వంసం చేస్తున్న జేసీబీ

వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడులో చెరువు ఆక్రమణల పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకు సంబంధించిన భూములను టీడీపీ నేతలు దగ్గరుండి జేసీబీతో ఆదివారం ధ్వంసం చేయించారు. గ్రామానికి చెందిన సుమారు 40 కుటుంబాలకు పాలిచెర్లపాడు చెరువును ఆనుకొని వ్యవసాయ భూములున్నాయి. వీరిలో 30 మంది రైతులు చెరువు భూమిని కొంత ఆక్రమించుకొని కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ భూములను ధ్వంసం చేసేందుకు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక టీడీపీ నేతలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జేసీబీ సాయంతో వీటిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు చేరుకొని జేసీబీని అడ్డుకున్నారు. అధికారుల ప్రమేయం లేకుండా.. నోటీసులివ్వకుండా భూములను ఎలా ధ్వంసం చేస్తారని ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల్లేకుండా భూములను ధ్వంసం చేయడమేమిటని ఆ శాఖ జేఈ పెంచలరావుతో రైతులు ఫోన్లో మాట్లాడగా, సక్రమంగా సమాధానం చెప్పలేదు. చెరువు ఆక్రమణలను తొలగించాలని, తమ భూములను మాత్రమే ధ్వంసం చేస్తే అంగీకరించేదిలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై పెంచలరావుతో ఫోన్లో మాట్లాడేందుకు యత్నించగా, ఆయన స్పందించలేదు.